# ఆహ్లాదకరంగా..పార్కులు

**వాకర్లకు వాకింగ్ ట్రాక్‌లు ● పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ● పచ్చదనంతో కళ కళ**

సికింద్రాబాద్,నవంబర్ 9:సికింద్రాబాద్ నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి కృషి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్కులకు కొత్త రూపు రేఖలు తీసుకొచ్చారు. ఏ పార్కు చూసినా పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో వివిధ పార్కులు గత అయిదేళ్ల కాలంలో కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ ప్రత్యేక చొరవతో పార్కుల రూపు రేఖలు మారి పోయాయి. నియోజకవర్గంలో ఏ పార్కు చూసినా హరిత వనాలతో పాటు వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ లతో ఆహ్లాదపరుస్తున్నాయి.

● సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో 22 కాలనీలు, కమ్యూనిటీ హాళ్లు, చిల్డ్రన్స్ పార్కులు ఉన్నాయి. గతంలో కేవలం కాగితాలకే వాటి నిర్వహణ పరిమితంగా నిలిచేది.ఇప్పుడు మాత్రం అభివృద్ధిలో ముందుకు దూసుకు పోతున్నది.

● హరితహారం, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాల్లో భాగంగా పార్కుల అభివృద్ధిపై డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. చిలకలగూడలో మార్కండేయ నగర్ పార్కు, నగులురి నరసింహ పార్కు, సీతాఫల్‌మండీలోని టీఆర్‌టీ పార్కు, మధురానగర్ కాలనీ పార్కు, మెట్టుగూడలో కేశవ నగర్ పార్కు, అడ్డగుట్టలో కొండా రెడ్డి పార్కు, సమోసా గార్డెన్, బౌద్ధనగర్‌లో బౌద్ధనగర్ కాలనీ పార్కు, లలితా నగర్ కాలనీ పార్కు, తదితర కాలనీ పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దారు.



పచ్చదనంతో కళకళలాడుతున్న మధురానగర్‌కాలనీ పార్కు

● లలితానగర్ పార్కులో ఓపెన్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. మరో మూడు పార్కుల్లో ఈ జిమ్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ప్రతి పార్కులో బోరింగ్‌ను ఏర్పాటు చేసి నాటిన మొక్కలు పెరిగేలా ఏర్పాట్లు జరిపారు.

● జీహెచ్ఎంసీ నిధులతో పాటు హరితనిధిలో భాగంగా తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి తెలంగాణ గ్రీన్ ఫండ్ ద్వారా ఏడు పార్కులను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. అడ్డగుట్ట డివిజన్‌లోని నందనగర్ పార్కు,తుకారాంగేట్‌లో కొండారెడ్డి పార్కు,,బౌద్ధనగర్ డివిజన్‌లోని బ్యాంక్ కాలనీలో ఎస్‌బీఎచ్ పార్కు,,లాలాపేటలో బెగ్గర్స్ హోం పార్కు, తార్నాకాలో బ్యాంబూ పార్క్,,మెట్టుగూడా డివిజన్‌లో హమాలీబస్తీ పార్కు, సీతాఫల్‌మండి డివిజన్‌లో మేడిబావి పార్కు, గ్రౌండ్‌లను తీర్చిదిద్దనున్నారు.



### సికింద్రాబాద్‌లో పార్కుల అభివృద్ధి

గతంలో పార్కులన్నీ ఎండి పోయి ఉండేవి.అంతా చెత్తమయంగా దర్శనమిచ్చేవి.ఎక్కువ శాతం ప్రజలు సేద తీరేందుకు పనికి రాకుండా ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరువాత సీఎం కేసీఆర్ కృషితో పార్కులన్నీ పచ్చదనంగా మారాయి. వాకర్లకు వాకింగ్ చేసుకోవడానికి ట్రాక్‌లను అధికారులు ఏర్పాటు చేశారు.ఇక కాలనీ వాసులు సేద తీరేందుకు అన్ని వసతులు కల్పించారు.ప్రస్తుతం సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఉన్న పార్కులు పచ్చదనంతో కళ కళలాడుతున్నాయి.

**మల్లూరి అనిల్‌కుమార్ ,సీతాఫల్‌మండి**



## పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## బీఆర్ఎస్‌కే దివ్యాంగుల మద్దతు

అడ్డగుట్ట, నవంబర్ 9 : దివ్యాంగుల సంక్షేమానికి, అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదని బీఆర్ఎస్ పార్టీ దివ్యాంగ విభాగం సీనియర్ నాయకులు డి.భువనేశ్వర్ అన్నారు. గురువారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల శ్రేయస్సు కోసం ఆహర్నిశలు ఆలోచించే పార్టీ బీఆర్ఎస్ అని ఆయన కొనియాడారు. రూ.500 ఉన్న పెన్షన్‌ను రూ.4016లకు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, ప్రభుత్వం అధికారంలోకి వస్తే మళ్లీ దాన్ని రూ.6016కు పెంచుతామని మ్యానిఫెస్టోలో చేర్చడం హర్షించదగిన విషయమన్నారు. దివ్యాంగుల సంపూర్ణ మద్దతు, బీఆర్ఎస్ పార్టీకి, సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కే అని ఆయన స్పష్టం చేశాడు. సికింద్రాబాద్‌లో దివ్యాంగులు సుమారు 5 వేల మంది ఉన్నారని, వారి కుటుంబంతో కలిపి 20 వేల పైచిలుకు ఓటర్లు ఉంటారని ఆయన తెలిపారు. వారందరూ బీఆర్ఎస్ పార్టీవైపే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌ను సికింద్రాబాద్‌లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన తెలిపారు.

## నేడు పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచారం

సికింద్రాబాద్,నవంబర్9: డిప్యూటీ స్పీకర్,బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచార పాదయాత్రను శుక్రవారం మెట్టుగూడ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ సీనియర్ నాయకుడు సుంకు రాంచందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కావున నాయకులు,కార్యకర్తలు,పజ్జన్న అభిమానులు,వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు పెద్ద ఎత్తున్న హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.చిలకలగూడ వైట్ హౌస్ నుంచి ఉదయం 10గంటలకు ప్రచార పాదయాత్ర ప్రారంభం అవుతుందన్నారు.

## ఆయుర్వేదంపై విద్యార్థులకు అవగాహన

సికింద్రాబాద్,నవంబర్ 9:అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యవర్ధిని ఆయుర్వేద సంస్థ ప్రతినిధులు అవగాహన సదస్సు నిర్వహించారు.గురువారం మేడిబావిలోని కాకతీయ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్‌వర్ధిని మాట్లాడుతూ..... వేల సంవత్సరాల చరిత్ర గల ఆయుర్వేదాన్ని నిర్లక్షం చేయడం వల్లనే ప్రజలు వివిధ రోగాల భారిన పడుతున్నారన్నారు. గృహ వైద్యం ద్వారా చిన్న చిన్న చిట్కాలతో వ్యాధులను నయం చేసే ఉపాయాలను విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో పాఠ శాల ప్రిన్సిపాల్ శ్రీహరి లక్షణ్, యోగా ట్రైనర్ జయరాజ్ ఆర్య, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపు క్రైస్తవ వివాహ పరిచయ వేదిక

హిమాయత్‌నగర్, నవంబర్ 9: క్రైస్తవ యువతీ యువకుల కోసం ఈ నెల 11న లక్డికా పూల్‌లోని లుథేరన్ చర్చిలో క్రైస్తవ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఇండియా క్రిస్టియన్ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ ఎస్.అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు 888507355, 8885428555 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## తల్లిదండ్రులు తిట్టారని..

కాచిగూడ, నవంబర్ 9 : తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపంచెందిన కూతురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఎస్సై పి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట డివిజన్ గోల్నాక కూరగాయల మార్కెట్‌లోని అంబేద్కర్ నగర్ ప్రాంతానికి చెందిన యాదయ్య కూతురు జి.సౌమ్య(21)డిగ్రీ చదువుతుంది. తల్లిదండ్రులు మందలించడంతో సౌమ్య మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సోదరుడు గౌతమ్ కాచిగూడ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రవికుమార్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.



సికింద్రాబాద్ నియోజకవర్గానికి సంబంధించి గురువారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి.సికింద్రాబాద్ నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు తమ నామినేషన్‌లను దాఖలు చేశారు.డిప్యూటీ స్పీకర్ ,సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి,సిట్టింగ్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావుగౌడ్ తరపున ఆయన తనయుడు త్రినేత్రగౌడ్ రెండో సారి నామినేషన్ పత్రాలను జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్లారెడ్డికి అందజేశారు. ఇప్పటివరకు సికింద్రాబాద్ నియోజకవర్గంలో 19 నామినేషన్లు వచ్చినట్లు సంబంధిత అధికారి పేర్కొన్నారు. – సికింద్రాబాద్,నవంబర్ 9:

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ 9: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండలోని ని జాంపేట ప్రాంతానికి చెందిన కృష్ణమాచార్యులు కుమారుడు వేణుగోపాల్(59) ప్రైవేటు ఉద్యోగి. బుధవారం రాత్రి ఉప్పుగూడ–యాకత్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### రాజకీయ లబ్ధి కోసమే
## బీజేపీ బీసీ సీఎం జపం

హిమాయత్‌నగర్, నవంబర్9: రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు తాము అధికారంలోకి వస్తే బీసీవ్యక్తిని సీఎం చేస్తామని బీజేపీ పార్టీ నాయకులు ప్రకటించడం విడ్డూరంగా ఉందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి ఆమోదించని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో బీసీ వ్యక్తిని సీఎం చేస్తామంటే నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు.కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తగిన నిధులు కేటాయించ కుండా బీసీలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు.అదానీలాంటి కార్పొరేట్ శక్తులకు కోట్లాది రూపాయల విలువైన దేశ సంపదను అప్పన్నంగా కేంద్రం అప్పగిస్తుందని విమర్శించారు. బీసీలపై మోదీకి చిత్తశుద్ధి ఉంటే బీసీ కులగణన చేపట్టి,చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఎక్స్‌రే గది నుంచి వచ్చే సరికి...

ఖైరతాబాద్, నవంబర్ 9 : చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ బంగారు గొలుసు మాయమైంది. పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. డీఐ కాంత్రికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.....బేగంపేటకు చెందిన కె. నాగమణి కొంత కాలంగా కీళ్లనొప్పులతో బాధపడుతున్నది. చికిత్స కోసం సోమాజిగూడలోని ది దక్కన్ హాస్పిటల్‌కు వచ్చింది. వైద్యులు ఎక్స్‌రే కోసం సూచించగా, ఆ విభాగానికి వెళ్లింది. ఎక్స్‌రే సమయంలో ఎలాంటి ఆభరణాలు ధరించవద్దని సిబ్బంది సూచించడంతో గది బయటే బ్యాగులో నాలుగు తులాల బంగారు గొలుసును పెట్టింది. ఎక్స్‌రే పూర్తయిన తర్వాత బయటకు వచ్చి చూసే సరికి బ్యాగు తెరిచి ఉంది. అందులోని బంగారు గొలుసు కనిపించలేదు. సిబ్బందిని ప్రశ్నించగా, వారు సరైన సమాధానం చెప్పలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.